“ఉత్తిష్ఠత!జాగృత!ప్రాప్యవరాన్నిబోధత”

కలియుగాబ్ది 5128

# హిందూ నగారా

మాసపత్రిక

సంపుటి 34 సంచిక : 09 శ్రీ పరాభవ నామ సంవత్సరం భాద్రపద మాసం సెప్టెంబరు 2026 పేజీలు : 16 విడిప్రతి : రూ 10


# మట్టి గణపతే... మహా గణపతి






తిరుమల అడవుల్లో రోబో డాగ్




# రైతులకు వరం కిసాన్ క్రెడిట్ కార్డు



# శేషాచలం అడవుల్లో 'రోబో డాగ్' సేవలు

శేషాచలం అడవుల్లో వన్యప్రాణుల కదలికలను పర్యవేక్షించడం, భక్తుల భద్రతను మరింత పటిష్ఠం చేయడమే లక్ష్యంగా తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) ఆధునిక సాంకేతికత వైపు అడుగులు వేస్తోంది. ఇందులో భాగంగా, ప్రమాదకరమైన అటవీ ప్రాంతాల్లో నిఘా పెట్టేందుకు 'క్వాడ్రుపెడ్ రోబోట్' (నాలుగు కాళ్ల రోబో డాగ్) వినియోగంపై దృష్టి సారించింది. తిరుమలలోని పద్మావతి అతిథి గృహం వద్ద ఈ రోబో డాగ్ పనితీరును టీటీడీ అదనపు ఈవో వెంకయ్య చౌదరి పరిశీలించారు. ఈ రోబో డాగ్‌లో ఆప్టికల్ కెమెరా, థర్మల్ ఇమేజింగ్ కెమెరా, 360 డిగ్రీల లైడార్ సెన్సార్ వంటివి ఉన్నాయి. వీటి సహాయంతో చిమ్మచీకటిలో, దట్టమైన పొగమంచులో కూడా వన్యప్రాణుల కదలికలను స్పష్టంగా గుర్తించవచ్చు. వన్యప్రాణులు భక్తులు తిరిగే ప్రాంతాల వైపు వస్తుంటే, రోబోలోని సౌండ్, లైట్ యూనిట్లను ఉపయోగించి ఎలాంటి హాని తలపెట్టకుండా వాటిని తిరిగి అడవిలోకి పంపే అవకాశాలను కూడా పరిశీలించారు.

## భారతీయ మహిళకు విక్రమ్ సారాభాయ్ మెడల్

బెంగళూరులోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఆస్ట్రోఫిజిక్స్ డైరెక్టర్ ప్రొఫెసర్ అన్నపూర్ణి సుబ్రమణియం 2026 సంవత్సరానికి గాను ప్రతిష్ఠాత్మక కాస్పార్ విక్రమ్ సారాభాయ్ పతకాన్ని గెలుచుకున్న తొలి భారతీయ మహిళగా చరిత్ర సృష్టించారు. ఇటలీలోని ఫ్లోరెన్స్‌లో ఇటీవల జరిగిన 46వ కాస్పార్ సైంటిఫిక్ అసెంబ్లీలో ఆమె ఈ అవార్డును అందుకున్నారు. ఆమె కంటే ముందు 1996లో యు.ఆర్. రావు: ఇస్రో మాజీ ఛైర్మన్, 2014లో గుర్బక్స్ సింగ్ లఖినా: అంతరిక్ష భౌతిక శాస్త్రవేత్త, 2024లో అనిల్ భరద్వాజ్: ఫిజికల్ రీసెర్చ్ లాబొరేటరీ డైరెక్టర్ తదితరులు ఈ పురస్కారాన్ని దక్కించుకున్నారు.




## చైనా కవలల భరతనాట్య ప్రదర్శన

భారతీయ ప్రాచీన శాస్త్రీయ నృత్యం భరతనాట్యాన్ని చైనాకు చెందిన కవల సోదరీమణులు జిన్ యాన్షు, జిన్ యాన్ అద్భుతంగా ప్రదర్శించి బీజింగ్ ప్రేక్షకులను మంత్రముగ్ధులను చేశారు. 'ఇద్దరు యువ నృత్య చైనీస్ కళాకారిణులు భారతీయ శాస్త్రీయ నృత్యం ప్రదర్శనలో పూర్తి ఉత్సాహంతో నిమగ్నమవడం అభినందనీయం" అని చైనాలో భారత రాయబారి విక్రం దొరైస్వామి ప్రశంసించారు. హైస్కూలులో చదువుతున్న పదహారేళ్ల జిన్ సోదరీమణులు మూడేళ్ల వయసు నుంచే ఈ నాట్యాన్ని అభ్యసించడం విశేషం. ప్రఖ్యాత నృత్య కళాకారిణి లీలా శాంసన్ శిష్యురాలైన జిన్ షాన్ష్ వీరికి గురువు.



## గురువాయూర్ ఆలయంలో 7 గంటల్లో 416 పెళ్లిళ్లు

కేరళలోని గురువాయూర్ శ్రీకృష్ణ ఆలయంలో 7 గంటల వ్యవధిలో రికార్డు స్థాయిలో 416 పెళ్లిళ్లు జరిగాయి. మలయాళ క్యాలెండరు ప్రకారం అత్యంత విశిష్టమైన చింగం మాసంలో తొలి ఆదివారం నాడు స్వామి సన్నిధిలో ఏకమయ్యేందుకు జంటలు పోటీ పడ్డాయి. ఈ ఆలయ సుదీర్ఘ చరిత్రలో ఒక్కరోజులో ఈ స్థాయిలో వివాహాలు జరగడం ఇదే తొలిసారి. గతంలో 2024 సెప్టెంబరు 8న 334 వివాహాలు జరగ్గా.. ఇప్పుడు ఆ రికార్డు బ్రేక్ అయిందని గురువాయూర్ దేవస్థానం బోర్డు తెలిపింది. రద్దీని దృష్టిలో పెట్టుకుని తెల్లవారుజామున 4.10 గంటల నుంచే వివాహ ప్రక్రియలను ఆలయ నిర్వాహకులు ప్రారంభించారు.



# రైతులకు వరం కిసాన్ క్రెడిట్ కార్డు





కేంద్ర ప్రభుత్వం రైతుల ఆర్థిక భద్రతను పెంపొందించే దిశగా కిసాన్ క్రెడిట్ కార్డు (కెసిసి) పథకాన్ని మరింతగా విస్తరించింది. కేవలం వ్యవసాయానికే పరిమితం కాకుండా, పశుపోషణ, మత్స్య పరిశ్రమ, పాడి పరిశ్రమ, మేకలు, పందుల పెంపకం వంటి అనుబంధ రంగాలకు కూడా కేసీసీ ద్వారా రుణ సదుపాయాన్ని అందిస్తున్నట్లు ప్రకటించింది. గ్రామీణ ప్రాంతాల్లోని రైతులు, వ్యవసాయ అనుబంధ రంగాలపై ఆధారపడిన వారి ఆదాయాన్ని గణనీయంగా పెంచడం, తద్వారా వారు ప్రైవేటు వడ్డీ వ్యాపారుల బారిన పడకుండా సంస్థాగత రుణాలను సులభతరం చేయడమే దీని ముఖ్య ఉద్దేశం. రైతుల ఆర్థిక అవసరాలను దృష్టిలో ఉంచుకుని, మోడిఫైడ్ ఇంట్రెస్ట్ సబ్‌వెన్షన్ స్కీమ్ కింద కిసాన్ క్రెడిట్ కార్డు రుణ పరిమితిని రూ.3 లక్షల నుంచి ఏకంగా రూ.5 లక్షలకు పెంచినట్లు ఆర్థిక శాఖ వెల్లడించింది. ఈ పెంచిన పరిమితి ద్వారా రైతులు తమ పెట్టుబడి అవసరాలకు, పంట నిర్వహణకు, అలాగే మత్స్య, పశుపోషణ రంగాల అభివృద్ధికి మరింత ఎక్కువ మొత్తంలో ఆర్థిక సహాయం పొందవచ్చు. సాధారణంగా కిసాన్ క్రెడిట్ కార్డు ద్వారా తీసుకునే వ్యవసాయ, అనుబంధ రంగాల స్వల్పకాలిక రుణాలపై వార్షిక వడ్డీ రేటు 7 శాతంగా ఉంది. అయితే, రైతులు తీసుకున్న రుణాన్ని సకాలంలో తిరిగి చెల్లిస్తే, అదనంగా 3 శాతం వడ్డీ రాయితీని ప్రోత్సాహకంగా ఇస్తారు.

**ఈ కార్డులు పొందడం ఎలా?**

కిసాన్ క్రెడిట్ కార్డు పొందడం ఇప్పుడు గతంలో కంటే మరింత సులభంగా మారింది. సొంత భూమి ఉన్న రైతులతో పాటు కౌలు రైతులు, భాగస్వామ్య రైతులు, స్వయం సహాయక సంఘాలు కూడా దీనికి నేరుగా దరఖాస్తు చేసుకోవచ్చు. రైతులు తమ సమీపంలోని వాణిజ్య, ప్రాంతీయ గ్రామీణ లేదా సహకార బ్యాంకు శాఖలను సంప్రదించి కేసీసీ కోసం దరఖాస్తు సమర్పించవచ్చు. ఆన్‌లైన్ దరఖాస్తుకు 'జన్ సమర్థ్' లేదా 'కిసాన్ రిన్' పోర్టల్‌ను కూడా ఉపయోగించుకోవచ్చని ప్రభుత్వం సూచించింది.

# శబరిమల పవిత్రతను కాపాడాలి

## గురుస్వాముల రాష్ట్ర సమ్మేళనంలో నిర్ణయం




శబరిమల అయ్యప్ప క్షేత్ర పవిత్రతను కాపాడటంతో పాటు అయ్యప్ప భక్తులకు మెరుగైన యాత్రా సౌకర్యాలు కల్పించేందుకు కేంద్ర, కేరళ, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వాలతో సమన్వయం చేసుకుని పనిచేస్తామని వక్తలు, ఆధ్యాత్మిక వేత్తలు తెలిపారు. నవంబరు 15 నుంచి జనవరి 20 వరకు జరిగే అయ్యప్ప సీజన్‌లో భక్తులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి ఇప్పటి నుంచే కార్యాచరణ ప్రారంభిస్తామని చెప్పారు. విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో అయ్యప్ప గురుస్వాముల రాష్ట్ర సమ్మేళనం నిర్వహించారు. రాష్ట్ర నలుమూలల నుంచి వచ్చిన గురుస్వాములు శబరిమల యాత్రలో ఎదురవుతున్న సమస్యల గురించి చర్చించారు. యాత్రలో అనారోగ్యానికి గురైతే సరైన వైద్యసాయం అందక దిక్కుతోచని పరిస్థితులు ఎదురవుతున్నాయని కొందరు గురుస్వాములు వివరించారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్ మాట్లాడుతూ, శబరిమల ఆలయ పవిత్రతను కాపాడటం ప్రతి హిందువు బాధ్యత అన్నారు. "హిందూ మతం, దేవాలయాలపై ఒకవైపు అన్యమత శక్తులు, మరోవైపు నాస్తిక శక్తులు దాడి చేస్తున్నాయి. సమాజానికి తెలియకుండా సమాంతర వ్యవస్థలు నడుస్తున్నాయి. శబరిమలలోనూ ఇలాంటి వ్యవస్థలు పనిచేస్తున్నాయి" అని మాధవ్ వ్యాఖ్యానించారు. కమ్యూనిస్టు ప్రభుత్వాలు భారతీయ ధర్మాన్ని బలహీనపరిచే ప్రయత్నాలు చేస్తున్నాయని ఆరోపించారు. శబరిమల ఆచార వ్యవహారాలపై న్యాయపోరాటం చేస్తున్న న్యాయవాదులకు, ధర్మ పరిరక్షణ కోసం కృషి చేస్తున్న వారికి మద్దతు ఇవ్వాలని కోరారు. శబరిమలలో టీటీడీ తరహాలో సమర్థమైన వ్యవస్థను ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందన్నారు. పంబ, నీలక్కల్ సన్నిధానం ప్రాంతాల్లో వసతి, వైద్య, సమాచార కేంద్రాలు ఏర్పాటు చేయాలని కోరారు. సత్రాల నిర్మాణానికి స్థలాలు కేటాయించేందుకు కేరళ ప్రభుత్వం ముందుకు రావాలని, అన్నదానం చేసేందుకు సిద్ధంగా ఉన్న సంస్థలకు అవకాశాలు కల్పించాలని అన్నారు. తెలుగు రాష్ట్రాల నుంచి శబరిమలకు ప్రత్యేక రైళ్లు ఏర్పాటు చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరతామని తెలిపారు.


# తిరుమలకు బ్రహ్మోత్సవ శోభ



**క**లియుగ ప్రత్యక్ష దైవం తిరుమల శ్రీవేంకటేశ్వర స్వామికి ఏడాది పొడవునా నిర్వహించే ఉత్సవాల్లో బ్రహ్మోత్సవాలు అత్యంత ప్రధానమైనవి. అధికమాసం కారణంగా ఈ ఏడాది రెండు బ్రహ్మోత్సవాలు భక్తులను అలరించనున్నాయి. నవరాత్రి బ్రహ్మోత్సవాల్లో ధ్వజారోహణం, ధ్వజావరోహణం ఉండవు. ఈ ఏడాది సెప్టెంబరు 15 నుంచి 23వ తేదీ వరకు శ్రీవారి సాలకట్ల (వార్షిక) బ్రహ్మోత్సవాలు, అక్టోబర్ 12 నుంచి 20వ తేదీ వరకు నవరాత్రి బ్రహ్మోత్సవాలు జరుగనున్నాయి. ఉదయం వాహనసేవ 8 నుంచి 10 గంటల వరకు, రాత్రి వాహన సేవ 7 నుంచి 9 గంటల వరకు జరుగుతుంది. గరుడ వాహన సేవ సాయంత్రం 6.30 నుంచి 12 గంటల వరకు జరుగుతుంది. 15వ తేదీ సాయంత్రం 6.21కు ధ్వజారోహణంతో శ్రీవారి బ్రహ్మోత్సవాలు ప్రారంభమవుతాయి. శ్రీదేవి, భూదేవి సమేత శ్రీమలయప్ప స్వామి సమక్షంలో వేదగానాల మధ్య మంగళవాయిద్యాలు మోగుతుండగా అర్చకస్వాములు బంగారు ధ్వజస్తంభంపై గరుడ ధ్వజాన్ని ఎగురవేస్తారు. సకల దేవతలను, అష్టదిక్పాలకులను బ్రహ్మోత్సవాలకు ఆహ్వానిస్తారు. అనంతరం వాహనసేవలు వైభవంగా ప్రారంభమవుతాయి. శ్రీదేవి, భూదేవి సమేత మలయప్ప స్వామివారు వివిధ వాహనాలపై తిరుమాడ వీధుల్లో ఊరేగుతూ భక్తులకు దర్శనమిస్తారు. మొదటి రోజు రాత్రి పెద్ద శేష వాహనంపై స్వామివారు ఊరేగుతారు. రెండో రోజు చిన్న శేష వాహనం, హంస వాహనం, మూడో రోజు సింహ వాహనంపై, ముత్యపువందిరి వాహనం, నాలుగో రోజు కల్పవృక్ష వాహనం,సర్వభూపాల వాహనం, ఐదో రోజు మోహినీ అవతారం, గరుడ వాహనం, ఆరో రోజు హనుమంత వాహనం, స్వర్ణ రథోత్సవం, ఏడో రోజు సూర్యప్రభ వాహనం, చంద్రప్రభ వాహనంపై స్వామివారు అభయమిస్తారు. ఎనిమిదో రోజు మహారథంపై స్వామివారు ఊరేగుతూ భక్తులకు దర్శనమిస్తారు. రాత్రి అశ్వ వాహనంపై ఉంటారు. తొమ్మిదో రోజు బ్రహ్మోత్సవాల ముగింపు రోజున శ్రీవారికి, శ్రీదేవి, భూదేవి అమ్మవార్లకు, చక్రత్తాళ్వార్లకు పుష్కరిణిలో చక్రస్నానం నిర్వహిస్తారు. సాయంత్రం ధ్వజావరోహణంతో ఈ ఉత్సవాలు పూర్తవుతాయి.

# సెప్టెంబర్‌లో ఫ్రాన్స్‌లో తొలి హిందూ దేవాలయం ప్రారంభం

**హిం**దూ సంస్కృతి, సంప్రదాయాలకు పెద్దపీట వేస్తూ ఫ్రాన్స్ లో మొట్టమొదటి భారీ హిందూ దేవాలయాన్ని నిర్మించారు. పారిస్ లోని బుస్సీ-సెయింట్- జార్జెస్ ప్రాంతంలో బోచా సన్యాసి అక్షర్ పురుషోత్తం స్వామినారాయణ్ సంస్థ నిర్మించిన ఈ స్వామినారాయణ్ హిందూ మందిరాన్ని సెప్టెంబర్‌లో అంగరంగ వైభవంగా ప్రారంభించనున్నారు. ఈ చారిత్రక ఘట్టాన్ని పురస్కరించుకుని సెప్టెంబర్ 2 నుంచి 14వ తేదీ వరకు 13 రోజులపాటు 'ఫెస్టివల్ ఆఫ్ కల్చర్' పేరిట ప్రత్యేక సాంస్కృతిక ఉత్సవాలు నిర్వహించనున్నారు. ఈ ప్రారంభోత్సవ వేడుకలను



బీఏపీఎస్ ఆధ్యాత్మిక గురువు మహంత్ స్వామి మహారాజ్ తన ఆశీస్సులతో పర్యవేక్షించనున్నారు. ప్రపంచవ్యాప్తంగా ఉన్న భక్తులు, శ్రేయోభిలాషులు ఈ కార్యక్రమానికి పెద్ద సంఖ్యలో హాజరవుతారని అంచనా వేస్తున్నారు. ఈ ఆలయ నిర్మాణానికి అవసరమైన రాళ్లను భారత్ నుంచి ఫ్రాన్స్‌కు తరలించారు. ఈ ఆలయ ప్రారంభంతో ఫ్రాన్స్‌లోని హిందూ సమాజ చరిత్రలో ఒక నూతన అధ్యాయం ప్రారంభం కానుండగా.. ఇది సందర్శకులకు గొప్ప ఆధ్యాత్మిక, సాంస్కృతిక అనుభూతిని అందిస్తుందని భావిస్తున్నారు.

## ఈ నెల పద్యము



**॥ అధరము గదలియు గదలక**
**మధురములగు భాషలుడుగి మౌనవ్రతుడౌ**
**నధికార రోగపూరిత**
**బధిరాంధక శవము జూడ బాపము సుమతీ! ॥**

**భావము:** ఓ సుమతీ! అధికార రోగంతో బాధపడుతూ, కళ్లు కనిపించక, చెవులు వినిపించక, నోరున్నా కూడా పెదవులు కదిలించి ఇతరులకు ఇష్టమైన మంచి మాటలు చెప్పకుండా అహంకారంతో మౌనంగా ఉండేవాడు బతికి ఉన్నా శవంతో సమానం. అటువంటి అధికార రోగంతో ఉన్న చెవిటి, గుడ్డి శవంలాంటి వాడిని చూడటం కూడా పాపమే.

# శ్రీవరి సాగులో కలుపు నివారణ



శ్రీవరి సాగు అనేది తక్కువ నీరు, తక్కువ విత్తనాలు, తక్కువ పెట్టుబడితో ఎక్కువ దిగుబడిని సాధించే ఒక ఆధునిక వరి సాగు పద్ధతి. ఇది ప్రత్యేక వరి వంగడం కాదు. ఏ రకమైన వరి వంగడాన్ని అయినా ఈ పద్ధతిలో సాగు చేయవచ్చు. దీనిని 1980వ దశకంలో మడగాస్కర్ దేశంలో అభివృద్ధి చేశారు. ఈ విధానంలో మొక్కల మధ్య దూరం ఎక్కువగా ఉండటం వల్ల కలుపు సమస్య ఎక్కువగా ఉంటుంది. నాటిన 10, 20, 30, 40 రోజుల దశలో కలుపును అణచివేయడం వల్ల అది మట్టిలో కలిసిపోయి మొక్కలకు పోషకాలు అందుతాయి. శ్రీవరి సాగులో వరి నాట్ల మధ్యలో 9 అంగుళాలు లేక 12 అంగుళాలు, సాళ్ళ మధ్యలో కలుపు తీయడానికి తేలిక పాటి కోనోవీడర్ పరికరం కలుపు నివారణలో రైతులకు బాగా ఉపయోగపడుతుంది. రైతులు ప్రస్తుతం 13 కేజీల బరువున్న కోనో వీడర్‌ను వ్యవసాయ క్షేత్రాల్లో వాడుతున్నారు. దీన్ని బురదలో నెడుతూ కలుపు తీయడానికి కష్టపడుతూవుంటారు. దీనిని దృష్టిలో ఉంచుకొని తక్కువ బరువు కలిగిన కోనోవీడర్‌ను రూపొందించారు. దీని బరువు 3 కేజీలు మాత్రమే. ఈ పరికరానికి శ్రీ ఆంజనేయ కోనోవీడర్‌గా నామకరణం చేశారు. దీని ధర రూ.2,500 ముందుగా ఒక చిన్న పడవలాంటి నమూనా తయారు చేసుకోవాలి. దానిని ఒక రెండు చక్రాల చట్రానికి వెల్డింగ్ ద్వారా అనుసంధానం చేసుకోవాలి. ఈ మొత్తం చట్రాన్ని 2 మీటర్ల రాడ్‌కు వెల్డింగ్ ద్వారా అనుసంధానించాలి. ఈ పరికరం బురదలోకి చొరబడకుండా ఇక్కడ పడవ చూస్తుంటే.. వెనుక ఉన్న ప్లాస్టిక్ చక్రాలు కలుపును వదదోస్తాయి. ఆ కలుపు వంటకు ఎరువుగా ఉపయోగపడుతుంది. ఈ పరికరాన్ని ముందుకు, వెనక్కి అనుకుంటూ సాళ్ళలో రైతులు ముందుకు పోతూ కలుపు నివారణ చేసుకుంటారు. అయితే ఇది చిక్కు వరిలో పనికిరాదు. రైతులు కోరితే దీన్ని తయారుచేసి ఇస్తామని శ్రీ ఆంజనేయ స్మాల్ అగ్రి టూల్స్ రీసెర్చ్ సెంటర్ డైరెక్టర్, రైతునేస్తం ప్రొఫెసర్ ముప్పా లక్ష్మణరావు తెలిపారు. మరిన్ని వివరాలకు మొబైల్ నం. 9849140465లో సంప్రదించవచ్చు.

**- ముప్పా లక్ష్మణరావు**

# సంతాన ప్రదాత పాలకొండ్రాయుడు!





**క**లియుగ దైవమైన వేంకటేశ్వరుడు ఈ భూమిపైన తొలిసారి అడుగుపెట్టి, స్థిర నివాసం ఏర్పరుచుకున్న ప్రాంతమే పాలకొండ్రాయుడి క్షేత్రం. పిల్లల్ని ప్రసాదించే సంతాన ప్రభువుగా పూజలు అందుకుంటున్న ఈ స్వామి ఇక్కడ కొన్ని వందల సంవత్సరాల క్రితం వెలిశాడని చెబుతారు. దట్టమైన అటవీ ప్రాంతంలో, ప్రకృతి అందాలు, జలధారల మధ్య ప్రసిద్ధ ఆ ఆలయం వెలిసింది. భృగు మహర్షి అహంకారాన్ని విష్ణుమూర్తి అణిచివేసిన తర్వాత లక్ష్మీదేవి... తాను నివాసం ఉండే స్వామి వక్షస్థలంపైన ఓ మహర్షి తన్నడన్ని సహించలేక వైకుంఠాన్ని వదిలి వెళ్లిపోయింది. ఆమెను వెతుక్కుంటూ శ్రీహరి భూలోకం బయల్దేరాడు. అలా స్వామి మొదటిసారి ఈ ప్రాంతంలో పాదం మోపాడని కథనం. తన దేవేరిని వెతుకుతూ అడవులన్నీ తిరిగిన స్వామి ఓ లోయలో పడిపోవడంతో మహావిష్ణువు కోసం బ్రహ్మ, శివుడు ఆవు-దూడ రూపాల్లో వచ్చి స్వామికి పాలు అందించి ఆకలి తీర్చారనీ... అందుకే ఈ ప్రాంతానికి పాలకొండలు అనే పేరు వచ్చిందనీ అంటారు. అప్పటినుంచీ నారాయణుడిని పాలకొండ్రాయుడిగా పిలుస్తున్నారు. కడప నగరానికి సమీపంలో ఉన్న ఈ ఆలయంలో కొలువైన స్వామిని ఇక్కడి ప్రజలు తమ ఇంటి ఇలవేల్పుగా భావిస్తారు. ఇక్కడ పాలకొండ్రాయుడి మూర్తితోపాటు పద్మావతీ దేవినీ, నవగ్రహాలనూ, ఉగ్ర నారసింహుడినీ దర్శించుకోవచ్చు. సంతానం లేని వారు పుష్కరిణిలో స్నానం చేసి తడి వస్త్రాలతో స్వామిని దర్శించుకుంటే సంతానం కలుగుతుందనీ నమ్మకం. అలా పుట్టిన పిల్లలకు పాలకొండ్రాయుడు, పాలకొండన్న, కొండయ్య, పాలకొండమ్మ, కొండమ్మ అనే పేర్లు పెడుతుంటారు. ఈ ఆలయానికి సమీపంలో భృగు మహర్షి నదిలా ఏర్పడి భృగు వంకగా మారాడని అంటారు. క్రమంగా అదే బుగ్గవంకగా మారిందనీ.. ఆ నది నీళ్లే అటు దేవుని కడపలో రాయుడినీ, ఇటు పాల కొండ్రాయుడినీ అభిషేకిస్తున్నాయనీ చెబుతారు.

**- ఎన్.ఎస్.కె. చక్రవర్తి**

# ప్రపంచానికి హిందూ వివేక సందేశం

1893 సెప్టెంబరు 11న అమెరికా చికాగో నగరంలో జరిగిన ప్రపంచ మత మహాసభలో స్వామి వివేకానంద చేసిన ప్రసంగం భారతదేశ ఆధ్యాత్మిక సంపదను ప్రపంచానికి పరిచయం చేసింది. "అమెరికా సోదర సోదరీమణులారా!" అంటూ ఆయన చేసిన సంబోధనతో ప్రారంభమైన ఆ ప్రసంగం కేవలం మతపరమైన ఉపన్యాసం కాదు. అది భారతీయ



సంస్కృతి, విశాల దృక్పథం, మానవతావాదం, మత సహనానికి ప్రపంచానికి వినిపించిన శక్తివంతమైన స్వరం. స్వామి వివేకానంద చికాగోకు వెళ్ళిన నాటికి భారతదేశం బ్రిటిష్ పాలనలో ఉంది. పాశ్చాత్య ప్రపంచం భారత్‌ను మూఢనమ్మకాల్లో కూరుకుపోయిన పేదదేశంగా భావించేది. అటువంటి సమయంలో భారతీయ తత్వచింతన, వేదాంతం, హిందూ ధర్మంలోని విశాల దృక్పథాన్ని ప్రపంచానికి పరిచయం చేయడం వివేకానంద సాధించిన గొప్ప చారిత్రక కార్యం. వివేకానంద తన ప్రసంగంలో భారతదేశాన్ని మత సహనం, విశాల హృదయానికి ప్రతీకగా పరిచయం చేసారు. భారతదేశం శతాబ్దాలుగా వివిధ మతాలు, విశ్వాసాలు, ఆధ్యాత్మిక సంప్రదాయాలకు ఆశ్రయం కల్పించిందని గుర్తుచేశారు. అక్కడ వివేకానంద చెప్పిన సహనం కేవలం "నువ్వు నీ మతాన్ని అనుసరించు, నేను నా మతాన్ని అనుసరిస్తాను" అనే పరిమిత భావన కాదు. ఇతర మతాల ఉనికిని అంగీకరించడమే కాకుండా, వాటి పట్ల గౌరవాన్ని కలిగి ఉండాలనే ఉన్నతమైన ఆలోచన. అందువల్ల ఆయన సందేశం నేటి బహుళత్వ సమాజాలకు కూడా ఎంతో ప్రాసంగికంగా కనిపిస్తుంది. వివేకానంద చికాగో ఉపన్యాసం ద్వారా భారతీయ వేదాంత తత్వాన్ని పాశ్చాత్య ప్రపంచానికి మరింత స్పష్టంగా పరిచయం చేశారు. ప్రతి మనిషిలోనూ దైవత్వం ఉందనే భావన ఆయన బోధనలో ప్రధానమైనది. మానవుడిని కేవలం శరీరంగా కాకుండా ఆధ్యాత్మిక శక్తి కలిగిన జీవిగా చూడాలన్నది ఆయన తత్వం. ఆ దృక్పథం భారతీయ ఆధ్యాత్మికతను మూఢ విశ్వాసాల సమాహారంగా చూసే అభిప్రాయాలను సవాలు చేసింది. హిందూ తత్వంలోని గాఢమైన తాత్త్వికతను, ఆత్మ-బ్రహ్మ భావనను, మానవ ఏకత్వాన్ని ప్రపంచానికి పరిచయం చేసింది.

# జాతీయతావాద కవిసమ్రాట్




**(సెప్టెంబర్ 10 విశ్వనాథ సత్యనారాయణ జయంతి)**

**తె**లుగు సాహిత్య చరిత్రలో విశ్వనాథ సత్యనారాయణ మేరు శిఖరం. కవి, నవలా రచయిత, నాటకకర్త, విమర్శకుడు, తాత్త్వికుడు, చరిత్రచేతన కలిగిన సాహితీవేత్తగా ఆయన కృషి అజరామరం. విశ్వనాథ సత్యనారాయణ జాతీయతావాదం ప్రధానంగా భారతీయ సంస్కృతి, తెలుగు భాష, చారిత్రక చైతన్యం, ధార్మిక-సాంస్కృతిక విలువలు, స్వాభిమానం అనే పునాదులపై నిర్మితమైంది. ఆయన దృష్టిలో జాతి కేవలం భౌగోళిక సరిహద్దుల సమాహారం కాదు. ఒక సమాజాన్ని తరతరాలుగా కలిపి ఉంచే భాష, సంస్కృతి, ఆచారాలు, స్మృతులు, చరిత్ర, విలువలు అన్నీ జాతీయ అస్తిత్వంలో భాగమే. అందుకే ఆయన రచనల్లో గత వైభవం కేవలం గతాన్ని పొగడడానికి మాత్రమే కాదు; వర్తమాన సమాజానికి ఆత్మవిశ్వాసాన్ని అందించే సాధనంగా మారుతుంది. విశ్వనాథ జాతీయతావాదానికి ముఖ్యమైన ఆధారం చరిత్ర. ఆయన 'ఆంధ్ర పౌరుషం', 'ఆంధ్ర ప్రశస్తి' వంటి రచనల్లో ఆంధ్రుల చారిత్రక శౌర్యాన్ని, సాంస్కృతిక ప్రత్యేకతను కవిత్వ రూపంలో ఆవిష్కరించారు. ముఖ్యంగా 'ఆంధ్ర ప్రశస్తి'లో చారిత్రక ఘట్టాలను కేవలం వాస్తవాలుగా కాకుండా సజీవమైన అనుభూతులుగా మలిచారు. చరిత్రను కవిత్వంగా మార్చి, సాధారణ పాఠకుడికి ఆంధ్ర చరిత్రలోని వీరగాథలను చేరువ చేసిన రచయిత విశ్వనాథ. ఒక జాతి తన గతాన్ని తెలుసుకున్నప్పుడే తన వర్తమానాన్ని ఆత్మవిశ్వాసంతో నిర్మించుకోగలదనే భావన ఆయన రచనల్లో కనిపిస్తుంది. విశ్వనాథ జాతీయతావాదం కేవలం రాజకీయ నినాదాల జాతీయత కాదు. సంస్కృతిని కాపాడటం, భాషను గౌరవించడం, చరిత్రను గుర్తుంచుకోవడం, సమాజపు విలువలను పరిశీలించడం, జాతి ఆత్మగౌరవాన్ని పెంపొందించడం అనే విస్తృతమైన భావనలు ఆయన జాతీయతలో ఉన్నాయి.

# చంద్రుడిపై శాశ్వత స్థావరం! భారత్‌ను ఆహ్వానించిన నాసా

**చం**ద్రుడిపై శాశ్వత స్థావరం ఏర్పాటు చేయాలన్న అమెరికా ప్రణాళికలో భారత్ భాగస్వామి అయ్యే అవకాశం ఉంది. నాసా ప్రతిపాదించిన 'మూన్ బేస్' కార్యక్రమంలో చేరాలని ఇస్రోను నాసా ఆహ్వానించింది. బెంగళూరులో ఆగస్టు 5, 6 తేదీల్లో జరిగిన భారత్–అమెరికా సివిల్ స్పేస్ జాయింట్ వర్కింగ్ గ్రూప్ సమావేశంలో ఈ ఆహ్వానం అందింది. చంద్రుడి దక్షిణ ధ్రువం సమీపంలో మానవులు నివసించే తొలి శాశ్వత స్థావరాన్ని ఏర్పాటు చేయాలన్నది నాసా ప్రణాళిక. వ్యోమగాములు అక్కడ నివసించడంతో పాటు పరిశోధనలు చేయనున్నారు. ఇందుకోసం మానవ సహిత, మానవ రహిత మిషన్ల ద్వారా అవసరమైన మౌలిక వసతులను దశలవారీగా ఏర్పాటు చేయనున్నారు. అంతరిక్ష పరిశోధనల నుంచి లభించే శాస్త్రీయ సమాచారాన్ని పరస్పరం పంచుకోవడంపైనా చర్చలు ముందుకు తీసుకెళ్లనున్నారు. భారత్, అమెరికా ఇప్పటికే నిసార్ ఉపగ్రహం ద్వారా భారీ అంతరిక్ష సహకారాన్ని కొనసాగిస్తున్నాయి. భవిష్యత్‌లో శాస్త్రీయ పరిశోధనలు, మానవ అంతరిక్ష ప్రయాణ సాంకేతికతపై కలిసి పనిచేయాలని తాజా సమావేశంలో నిర్ణయించారు.




## విజయవాడ నుంచి కాశీకి నేరుగా విమానం

**ఆం**ధ్రప్రదేశ్ నుంచి ఆధ్యాత్మిక నగరం కాశీకి వెళ్లే భక్తులకు శుభవార్త. విజయవాడ అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి వారణాసికి నేరుగా కొత్త ఇండిగో విమాన సర్వీసులు అందుబాటులోకి వచ్చాయి. ఈ సర్వీసులు వారంలో మూడు రోజులు.. మంగళవారం, గురువారం, శనివారం అందుబాటులో ఉంటాయి. దీంతో ఏపీ నుంచి కాశీ విశ్వనాథుడి దర్శనం, గంగాస్నానం తదితర ఆధ్యాత్మిక యాత్రలకు వెళ్లే భక్తులకు ప్రయాణ సమయం గణనీయంగా తగ్గనుంది. ఇప్పటివరకు ఇతర మార్గాల్లో ప్రయాణించాల్సి వచ్చిన భక్తులకు ఈ డైరెక్ట్ విమాన సర్వీసు మరింత సౌకర్యవంతంగా మారనుంది. ముఖ్యంగా వృద్ధులు, కుటుంబాలతో కాశీ యాత్రకు వెళ్లేవారికి ప్రయోజనం చేకూరనుంది.




# అహంకారమే జ్ఞానోదయానికి అడ్డంకి

**గౌ**తమ బుద్ధుడికి ఆనందుడు దాదాపు 40 ఏళ్ల పాటు సహచరుడిగా ఉన్నాడు. అయినా అతనికి జ్ఞానోదయం కాలేదు. అతడి కంటే గౌతముడికి శిష్యులుగా చేరినవారిలో ఎంతోమందికి జ్ఞానోదయం అయింది. ఆనందుడు గౌతముడికి అన్న వరుస అవుతాడు. అతను గౌతముడి వద్ద శిష్యరికం స్వీకరించే ముందు 'దీక్ష తీసుకున్న తర్వాత నీ శిష్యుడిని అవుతాను. నువ్వు ఏం చెబితే అది చేయాల్సి ఉంటుంది. అలాగే చేస్తాను కూడా. కాబట్టి అంతకుముందే నీ వద్ద మూడు వాగ్దానాలు తీసుకోవాలి అనుకుంటున్నాను' అన్నాడు. దానికి గౌతముడు నవ్వుతూ ఏమిటి ఆ వాగ్దానాలు అని ప్రశ్నించాడు. అప్పుడు ఆనందుడు చెప్పాడు. ఒకటి.. అన్ని వేళలా నేను నీతోనే ఉండాలి. నన్ను ప్రచారం కోసం ఎక్కడికీ పంపకూడదు. గౌతముడు సరేనన్నాడు. రెండోది.. నేనెంత మూర్ఖమైన ప్రశ్న అడిగినా కూడా నవ్వకుండా సమాధానం చెప్పాలి. దాన్ని వదిలేయడం గానీ విషయం మార్చడానికి గానీ ప్రయత్నం చేయకూడదు. దీనికీ గౌతముడు అంగీకరించాడు. ఇక మూడోది.. నీతో పరిచయం చేయడానికి నేను ఎవరినైనా తీసుకొస్తే అది అర్ధరాత్రి అయినా సరే నువ్వు లేచి మాట్లాడాలి. గౌతముడు ఒప్పుకున్నాడు. ఆనందుడు దీక్ష స్వీకరించాడు. ఇలాగే 40 ఏళ్లు గడిచి పోయాయి. గౌతముడు దేహ పరిత్యాగం చేయాల్సిన సమయం ఆసన్నమైంది. అప్పుడు ఆనందుడిని పిలిచాడు. 'నువ్వు నీ గురువుకు ఆంక్షలు విధించావు. ఎందుకంటే నేను నీకు తమ్ముడిని అవుతాను కాబట్టి. నువ్వు గౌతముడి కంటే పెద్దవాడిని అనే ఆలోచనతోనే ఇన్ని రోజులూ గడిపావు. అక్కడే చిక్కుకుపోయావు. అయినా చింతించవద్దు. నేను మరణించిన తర్వాత 24 గంటల్లోగా నీకు జ్ఞానోదయం అవుతుంది. అంటే కేవలం నేను కాకుండా నా మరణం నీకు సహాయం చేస్తోందన్నమాట' అన్నాడు. ఆనందుడు ఏడుస్తూ నాకు జ్ఞానోదయం కాకపోయినా ఫర్వాలేదు. నేను కూడా నీతో పాటు మరణిస్తాను అన్నాడు. గౌతముడు 'సమయం వృథా చేయకు. కేవలం గౌతముడి కన్నా నేను పెద్దవాడిని అనే అహంకారమే నా కళ్లల్లోకి కూడా నిన్ను చూడకుండా చేసింది. ఇప్పుడు నా కాళ్లు పట్టుకున్నా ఉపయోగం లేదు' అన్నాడు. గౌతముడు మరణించిన 24 గంటలకు ఆనందుడికి జ్ఞానోదయం అయింది. 40 ఏళ్ల పాటు నది ఒడ్డున కూర్చొని కూడా ఆనందుడు దప్పిక తీర్చుకోలేకపోయాడు.



– హైందవి





**అ**ర్చన, వ్రతం, క్రతువు, యజ్ఞయాగాదులు.. ప్రక్రియ ఏదైనా తొలి పూజ గణనాథుడికే. ఇది ముక్కోటి దేవతలలో ఆయనకే దక్కిన అరుదైన గౌరవం. వినాయకుడు ఆధ్యాత్మిక, సామాజిక, విజ్ఞానాత్మక, ఆరోగ్యాది అంశాల సమాహారం. ఆయన ప్రకృతి ప్రేమికుడు. కొన్నేళ్లుగా గణపతి విగ్రహాల తయారీలో రసాయనాల వాడకం ఎక్కువ కావడంతో పర్యావరణానికి ముప్పువాటిల్లుతోంది. **ముఖ్యంగా విగ్రహాల నిమజ్జన సందర్భాలలో సరస్సులు, చెరువులు కాలుష్య కాసారాలుగా మారుతున్నాయి. అలాంటి విగ్రహాల తయారీని మానుకోవాలని ప్రభుత్వం, స్వచ్ఛంద సంస్థలు హితవు చెబుతూ ఉద్యమిస్తున్నాయి. మట్టితో చేసిన విగ్రహాల ఉచిత పంపిణీ చేపడుతూ కొంత మేర సత్ఫలితాలు రాబడుతున్నాయి.**


వినాయకోత్పత్తి కథనం ప్రకారం, ఆయన పుట్టుకకు ప్రకృతిసిద్ధ పదార్థమే మూలం. జగన్మాత పార్వతి మంగళస్నానం సందర్భంగా నలుగుపిండితో తయారుచేసిన బొమ్మకు ప్రాణం పోసి, వాకిలి వద్ద కావలి ఉంచడం, ఆమె మందిరంలోకి తన ప్రవేశాన్ని అడ్డగించడంతో ఆగ్రహించిన శివుడు, బాలుడి తలను తుంచి, ఆ తర్వాత గజాసురుడి తలను అతికించి పునర్జీవింపచేయడం లోక ప్రసిద్ధమైన కథ. వినాయక ప్రతిమల తయారీ కోసం గతంలో చెరువుకు వెళ్లి బంకమట్టిని తెచ్చి కొయ్య ఫలకంపై అచ్చు పోసేవారు. పూజ అనంతరం విగ్రహాలను చెట్లు, మొక్కల పాదులలో ఉంచితే, వర్షాలకు కరిగిపోయేవి. ప్రకృతితో మమేకమై చెట్టును, పుట్టనూ, నేలను ఆరాధించడమే ఈ పండుగలోని పరమార్థం. నేడు తులసి తదితర విత్తనాలతోనూ విగ్రహాలు రూపొందిస్తున్నారు. పూజానంతరం వాటిని జల నిమజ్జనం చేయడం కంటే నేలలో నాటి, నీరు పోయడం వల్ల విగ్రహాలు కరిగి విత్తనాలు మొలకెత్తుతాయి. అలాగే గోమయంతోనూ కాగితపు గుజ్జు, గడ్డి, ఆకులు, విత్తనాలు, పండ్లతోనూ విగ్రహాలు తయారు చేస్తున్నారు.

వల్ల శివ, విష్
రూపంగా అభివర్ధిస్తా
అష్టదిక్కులకు వ్యాపించిన

**పర్యావరణ హితైషి గణేశ**

ఇతర దేవతా వ్రతాలకు
దేవతా ప్రతిమలను ఉ
ఉన్నా, మృత్తికా విగ్రహ
గల మూలాధార
పూజించాల







## నిమజ్జనం

గణనాథుడు జలరూపుడు. అందుకే నవరాత్రోత్సవాల తర్వాత ఆయన ప్రతిమలను జలాల్లో నిమజ్జనం చేస్తారు. వినాయక విగ్రహాలను మట్టితో తయారు చేయడం వెనుక సామాజిక నేపథ్యం ఉంది. వర్షాకాలంలో చెరువుల్లో పూడిక తీస్తారు. అలా సేకరించిన మట్టితో విగ్రహాలు చేసేవారు. పూడిక తీయడంతో నీరు చేరిన వనరులలోనే ఈ ప్రతిమలను నిమజ్జనం చేసేవారు. నిమజ్జనం సందర్భంగా వదిలిన పత్రి కారణంగా కొత్తగా చేరిన నీటిలోని సూక్ష్మక్రిములు నశిస్తాయనే వైజ్ఞానిక రహస్యం దీనిలో ఇమిడి ఉంది.

**- జాగృతి సౌజన్యంతో**

### వ్యక్తిత్వ వికాస నిపుణుడు

శారీరక బలం కన్నా బుద్ధిబలం గొప్పదని చాటిన వ్యక్తిత్వవికాస నిపుణుడు వినాయకుడు. తనలోని బలం, బలహీనతను ఎరిగి ప్రవర్తించాలని చెబుతాడు. గెలిచి తీరాలన్న సంకల్పం ఉంటే సాధించలేనిది లేదని, స్వీయ లోపాలను అధిగమించడం పెద్ద సమస్య కాబోదని వినాయకుడు లోకానికి చాటిచెప్పాడు.

# మట్టి గణపతే... మహా గణపతి



దక్షిణాయనం దేవతా ప్రీతికరమైనది. చాలా పండుగలు వచ్చే కాలమిదే. ఆ పరంపరంలో మొదటి పండుగ వినాయకచవితి. గణపతి అర్చన నుంచి నైవేద్యం వరకు అన్నీ ప్రకృతి సంబంధిత వస్తువులు, పదార్థాలే. పర్యావరణ పరిరక్షణ, ఆరోగ్య రహస్యాలు దీనికి నేపథ్యంగా భావించవచ్చు. గణపతి విష్ణు రూపాంతరమని, శివపార్వతుల తనయుడిగా జన్మించడం వల్ల శివ, విష్ణు తత్త్వాల సంగమమని చెబుతారు. పైగా ద్వయరూపాల సమ్మేళనం కనుక అత్యంత శక్తిమంతమైన రూపంగా అభివర్ణిస్తారు. విశ్వనిర్వహణ సజావుగా సాగేందుకు త్రిమూర్త్యాది దేవతలు గణపతిని పూజిస్తారని శివపురాణం, క్కులకు వ్యాపించిన శిష్ట జన రక్షకుడని ముద్గల పురాణం పేర్కొంటున్నాయి.

## ణ హితైషి గణేశుడు

దేవతా వ్రతాలకు సంబంధించి భక్తులు తమ శక్తిని బట్టి స్వర్ణ, రజత, కాంస్య లోహాలతో చేసిన తా ప్రతిమలను ఉపయోగించవచ్చని చెబుతారు. వినాయకుని విషయంలోనూ ఆ వెసులుబాటు న్నా, మృత్తికా విగ్రహార్చనకే తొలి ప్రాధాన్యం. పతంజలి యోగ శాస్త్రపరంగా, పృథ్వీ తత్త్వం గల మూలాధార చక్రానికి గణనాథుడే అధిష్ఠాన దైవం. మట్టి వినాయకుడిని పూజించాలనడంలోని రహస్యమిదేనని ఆధ్యాత్మిక వేత్తలు చెబుతారు. మట్టితో చేసిన ప్రతిమను పూజిస్తే సకల శుభాలు కలుగుతాయని గణేశ పురాణం చెబుతోంది. వినాయకుని ప్రతిమ తయారీకి అదే శ్రేష్ఠం. సువర్ణమూర్తిని పూజిస్తే సంకల్పసిద్ధి, వెండి విగ్రహార్చనతో ఆయుష్షు, రాగి విగ్రహంతో పూజిస్తే ఐశ్వర్యం, మట్టి విగ్రహంతో అర్చిస్తే మోక్షం సిద్ధిస్తుందని చెబుతారు. ఇతర లోహాలతో రూపొందే ప్రతిమలు ప్రకృతిలో సంపూర్ణంగా విలీనం కావు.



## పత్రి పూజా విశిష్టత

వినాయకుడి 'సర్వాణ్యంగాని పూజయామి' అంటూ ఇరవై ఒక్క (ఏక వింశతి) రకాల ఆకులతో ఒక్కొక్క నామాన్ని స్మరిస్తూ అర్చిస్తారు. మాచీ పత్రం (దవనం), బృహతీపత్రం (ములగ), బిల్వ (మారేడు), దూర్వారయుగ్మం (గరిక), దత్తూర (ఉమ్మెత్త), బదరీ (రేగు), అపామార్గ (ఉత్తరేణి), కశ్యపాయ పత్రం (తులసీ), చూతపత్రం (మామిడి), కరవీర (గన్నేరు), విష్ణుక్రాంత (అవిసె), దాడిమీ (దానిమ్మ), దేవదారు, మరువక, సింధూర (వావిలాకు), జాజి, గండకీ (సీతాఫలం, కామంచి), శమీ (జమ్మి), అశ్వత్థ (రావి), అర్జున (మద్ది), అర్క (జిల్లేడు) పత్రులన్నీ ఓషధీ గుణాలు కలిగినవే. వీటి ద్వారా అనేక వ్యాధులను నివారించవచ్చని ప్రకృతి వైద్యం, ఆయుర్వేదం చెబుతున్నాయి. ఈ ఆకుల పరిమళాలతో శ్వాసకోశ వ్యాధులు నయమవుతాయి. ఈ విధంగా పూజల పేరుతో ఏడాదికి ఒకసారైనా వివిధ ఆకులను తాకే అవకాశం కోసమే పూర్వీకులు ఇలాంటి సంప్రదాయాలు ప్రవేశపెట్టి ఉండొచ్చు. ఔషధ గుణాలున్న పత్రి సేకరణకు ఈ మాసమే అనుకూలం అని చెబుతారు.



## నైవేద్యాలు



వర్షరుతువులో ఆకలితో పాటు జీర్ణశక్తి తక్కువగా ఉంటుంది. కాబట్టి ఆహారంలో ఉప్పు, కారం, తీపి తగ్గించాలి. గణపతి నవరాత్రుల సందర్భంగా రోజుకొక ధాన్యంతో ప్రసాదాన్ని పంచుతారు. నూనె వాడనని మోదకాలు (ఉండ్రాళ్లు), కుడుములను నివేదించడం సంప్రదాయం. ఆవిరిపై ఉడికించిన మోదకాలు ఎన్నో పోషక విలువలు కలిగి త్వరగా జీర్ణమై శరీరానికి పుష్టిని కలిగిస్తాయి, నువ్వులు శ్వాస సమస్యలతో పాటు అధికామ్లం, అజీర్తిని తొలగించి, నేత్రవ్యాధులను నివారిస్తాయి. బెల్లం జీర్ణశక్తిని పెంచి, వాత పిత్త రోగాలను నివారిస్తుంది. అందుకే నువ్వులు, బెల్లంతో తయారుచేసిన చిమ్మిలిని నైవేద్యంగా వినియోగిస్తారు. ఈ మాసంలో లభించే పండ్లు, మొక్కజొన్న, వెలక్కాయను గణపతికి నైవేద్యం సమర్పించి ప్రసాదంగా స్వీకరించడం ఆనవాయితీ.

# ఆవు పేగులో దివ్యౌషధం!

ఆవు పేగుల్లో ఉండే ఒక ఎంజైమ్ మనుషులకు హానిచేసే బ్యాక్టీరియాను అంతమొందించడంలో సహాయపడుతుందని బెంగళూరులోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్సెస్ (ఐఐఎస్సీ) అధ్యయనంలో తేలింది. ఇక్కడి మైక్రోబయాలజీ అండ్ సెల్ బయాలజీ (ఎంసీబీ) పరిశోధక విద్యార్థులు చేపట్టిన అధ్యయనం ప్రకారం.. మానవ శరీరంలో అసినెటోబ్యా క్టర్ బౌమన్నీ అనే బ్యాక్టీరియా మొండి గాయాలకు కారణమవుతుంది. ఈ బ్యాక్టీరియా తనచుట్టూ ఒక బయోఫిల్మ్‌ను ఏర్పాటుచేసుకుని యాంటీబయాటిక్ ల నుంచి రక్షణ పొందుతుంది. పాలీశాకరైడ్, ప్రొటీన్, లిపిడ్, ఎక్స్‌ట్రా సెల్యులార్ డీఎన్ఏలతో తయారైన ఆ బయోఫిల్మ్.. రోగనిరోధక ఇంజెక్షన్లు, మందుల ప్రభావాన్ని తగ్గించి, గాయాన్ని అలానే ఉంచుతుంది. దీనికి ఆవు పేగులో ఉండే కొ రుమెన్ హైడ్రోలేజ్ ఎగైనెస్ట్ ఎ. బౌమన్నీ (సీఆర్‌హెచ్ఏబీ) అనే ఎంజైమ్ ఆయుధంలా పనిచేస్తోంది. ఇది బయోఫిల్మ్ లోని పాలీశాకరైడ్‌లను జీర్ణం చేసుకుంటుంది. తద్వారా బయోఫిల్మ్ బలహీనపడి, బ్యాక్టీరియాపై యాంటీబయాటిక్స్ సమర్థంగా పనిచేస్తాయి. ఈ ఎంజైమ్‌ను ఎలుకల గాయాలపై ప్రయోగిస్తే సత్ఫలితాలు వచ్చాయని ఐఐఎస్సీ భౌతిక రసా యన శాస్త్ర విభాగం అసోసియేట్ ప్రొఫెసర్ దేబాశీష్ దాస్ తెలిపారు.

# ఆన్‌లైన్‌లో శ్రీశైలం ఆర్జిత సేవా టికెట్లు



నంద్యాల జిల్లాలోని శ్రీశైల భ్రమరాంబ మల్లికార్జున స్వామి, అమ్మవార్ల దేవస్థానంలో సెప్టెంబరు నెలకు సంబంధించిన ఆర్జిత సేవ, దర్శన టికెట్లను ఆన్‌లైన్లో అందుబాటులో ఉంచుతున్నట్లు ఈవో శ్రీనివాసరావు తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ.. స్వామివారి స్పర్శ దర్శనం, శీఘ్ర, అతిశీఘ్ర దర్శనాలతో పాటు 14 రకాలైన ఆర్జిత సేవలకు సంబంధించిన టికెట్లను ఆన్ లైన్లో అందుబాటులో ఉంచుతున్నామని చెప్పారు. మనమిత్ర వాట్సాప్ నం. 9552300009 ద్వారా కానీ, www.tms.ap.gov.in వెబ్‌సైట్ ద్వారా కానీ టికెట్లు పొందవచ్చని తెలిపారు. ఆన్‌లైన్‌లోనే 90 శాతం టికెట్లు అందుబాటులో ఉంచుతున్నామని వెల్లడించారు. భక్తులు దర్శనానికి వచ్చే గంట సమయం ముందు వరకు టికెట్ల లభ్యత ఉంటే తీసుకునే అవకాశం ఉంటుందని చెప్పారు. ఆర్జిత సేవలు, దర్శన టికెట్లను పొందడం కోసం కేవలం అధికారిక వెబ్ సైట్లను మాత్రమే ఉపయోగించాలని ఈవో సూచించారు.

# ఒకప్పటి నక్సల్స్ ప్రభావిత ప్రాంతం! ఇప్పుడు పర్యాటక కేంద్రం..!!

ఛత్తీస్‌గఢ్‌లోని బస్తర్ డివిజన్, ఒకప్పుడు నక్సలైట్ల ప్రాబల్యంతో భయానక వాతావరణానికి నిలయంగా ఉండేది. అయితే, ఇప్పుడు అక్కడ పరిస్థితులు పూర్తిగా మారిపోయాయి. బీజాపూర్ జిల్లాలోని 'నంబి' జలపాతం ఇందుకు నిదర్శనంగా నిలుస్తోంది. గతంలో ఇక్కడికి వెళ్లడానికి జనం వెనుకాడేవారు. కానీ నేడు పర్యాటకులతో ఈ ప్రాంతం కళకళలాడుతోంది. రాష్ట్రంలోనే ఎత్తైన జలపాతాల్లో ఒకటిగా గుర్తింపు పొందిన నంబికి సందర్శకుల తాకిడి పెరగడంతో స్థానిక యువతకు మెరుగైన ఉపాధి అవకాశాలు లభిస్తున్నాయి. గ్రామానికి చెందిన 27 మంది యువకులు ఒక కమిటీగా ఏర్పడి, పర్యాటకులకు గైడ్‌లుగా సేవలందిస్తున్నారు.




కేవలం రెండు నెలల వ్యవధిలోనే వీరు గైడ్ సేవలు, ఇతర కార్యకలాపాల ద్వారా రూ. 2 లక్షలకు పైగా ఆదాయాన్ని ఆర్జించారు. పర్యాటకుల సౌకర్యార్థం ప్రత్యేక వంటశాలలను ఏర్పాటు చేసి, ప్లేట్ రూ. 120 చొప్పున భోజనాన్ని అందిస్తున్నారు. జూలై నుండి ఇప్పటివరకు 2,000 మందికి పైగా పర్యాటకులు ఈ జలపాతాన్ని సందర్శించారు. ప్రభుత్వం కొత్తగా రహదారిని నిర్మించడంతో పర్యాటకులకు ప్రయాణం మరింత సులభతరమైంది. నక్సలైట్ల ప్రభావం తగ్గడం, మెరుగైన రవాణా సౌకర్యాలు, సోషల్ మీడియా ప్రచారం కారణంగా నంబి జలపాతం నేడు బస్తర్ ప్రాంతంలో వస్తున్న సానుకూల మార్పులకు నిలువుటద్దంగా నిలుస్తోంది.

## మన పండుగలు.. వంటింటి దినుసులు!

శ్రావణ, భాద్రపద మాసాల్లో మనం జరుపుకొనే పండుగలకు, వంటింట్లో అత్యంత సాధారణంగా ఉపయోగించే దినుసులకు విడదీయరాని అనుబంధం ఉంది. ప్రతి పండుగలోనూ ఈ దినుసులతో చేసే ప్రత్యేక వంటకాల్లో ఎన్నో ఆరోగ్య రహస్యాలు దాగి ఉన్నాయి.

**నాగుల చవితి..** మన దేహంలో వాత, కఫ, పిత్త ప్రకోపాన్ని నివారించే నువ్వులు, బెల్లంతో తయారుచేసే నూగుల ముద్ద, కొబ్బరి, బియ్యంపిండి, బెల్లంతో తయారయ్యే చలిమిడిని నాగుల చవితి రోజున ప్రసాదం రూపంలో స్వీకరిస్తాం. పుట్టలో పాలు పోయడం వల్ల చీమల వంటి ప్రాణుల్లో భగవంతుడి ఆరాధన చేస్తాం. పర్యావరణ పరిరక్షణలో ఇదీ ఒక భాగం.

**గరుడ పంచమి..** ఫణి గౌరి వ్రతంగా జరుపుకొనే ఈ వ్రతంలో దేవతారాధనలో భాగంగా పేలాలు, నువ్వులు కలిపిన పిండిని నివేదిస్తారు. పేలాలు తక్షణ శక్తిని, నువ్వులు, బెల్లం మిశ్రమం ఉష్ణాన్ని తగ్గిస్తుంది.

**శ్రీ వరలక్ష్మీ వ్రతం..** ఈ రోజున అమ్మవారికి జాజి (సుగంధ ద్రవ్యం), పున్నాగ (దీనిచెట్టు జిగురు గాయాలు మాన్పుతుంది. ఈ విత్తనాల నుంచి తీసిన నూనె, వాత నొప్పులు తగ్గిస్తుంది), చేమంతి (పూల రెక్కలతో చర్మ వ్యాధి నివారణ మందు తయారవుతుంది), కుడుములు నివేదిస్తారు. ఇదొక సంపూర్ణ ఆహార ఆరోగ్య ప్రదాయిని. ఇంకా పాయసం, దద్ధోజనం, పులిహోర వంటి ప్రసాదాల తయారీలోఉపయోగించే పెసరపప్పు, బియ్యం, బెల్లం, మిరియాలు, జీలకర్ర, నెయ్యి మొదలైనవి అన్నీ వంటింటి దినుసులతోనే తయారవుతాయి. ఆయుర్వేద గుణాలున్న ఈ దినుసులు మన రోగ నిరోధక శక్తిని పెంచుతాయి.



**శ్రీ కృష్ణాష్టమి..** ఈ పండుగ రోజు పాలు, పెరుగు, వెన్న, మీగడ,నెయ్యితో, శొంఠి, బెల్లం, అటుకులు నివేదనగా సమర్పిస్తాం ఇవి కూడా వాత, పిత్త కఫ దోషాల సమత్వం కోసం సహకరిస్తాయి.

**వినాయక చవితి..** 21 రకాల ఆకులతో వినాయక వ్రతం చేస్తాం. కుడుములు, ఉండ్రాళ్ళు, వడపప్పు, గుగ్గిళ్ళు వంటి నివేదనల్లో గోధుమ, బియ్యం, శెనగలు, పెసర పప్పు, బెల్లం వంటి పోషక విలువలు కలిగిన పదార్థాలు వాడతాం. ఇవి కూడా త్రిదోష సమతుల్యాన్ని కాపాడతాయి. వెలగ (పిత్త శామకము). వినాయకుడికి అత్యంత ఇష్టమైన కుడుములు, ఉండ్రాళ్ళు సులభంగా జీర్ణమవుతాయి, శరీరానికి తక్షణ శక్తిని ఇస్తాయి.

**- రామ శర్మ**

## వీరి వీరి గుమ్మడి పండు వీరి పేరేమి!

"వీరి వీరి గుమ్మడి పండు వీరి పేరేమి?.. దాగుడు మూతల దండాకోరు వీరి పేరేమి?.." అనేది తెలుగువారి ప్రాచీనమైన, అందమైన గ్రామీణ బాల్య ఆట. ఈ ఆట గ్రామాల్లో చాలా ప్రాచుర్యం పొందింది. పిల్లలు అందరూ కలిసి తిరుగుతూ సరదాగా పాడుకుంటూ ఆడే ఈ ఆట చిన్నపిల్లల్లో జ్ఞాపకశక్తిని, చురుకుదనాన్ని పెంచుతుంది. ఈ ఆటను రెండు రకాలుగా ఆడతారు. ఒకరిని దొంగగా అనుకొని, అతనికి ఎదురుగా వరుసగా ఉన్నవాళ్లను చూపించి, అతడి కళ్ళను మూస్తారు.



తరువాత ఎదురుగా ఉన్న వాళ్ళు అటు ఇటు స్థానాలు మార్చుకొని నిలబడతారు. ఇప్పుడు కళ్ళు మూసిన నాయకుడు.. దొంగ చెయ్యి పట్టుకొని ఎదురుగా ఉన్నా వాళ్ళను చూపిస్తు –వీరి వీరి గుమ్మడి పండు వీరి పేరేమి?..– అని అడుగుతారు. దొంగ చూపించిన వాళ్ళు వెళ్ళి దాక్కుంటారు. "దొంగ" కళ్లుతెరిచి అందరినీ వెతకాల్సి ఉంటుంది. దొరికిన వారు దొంగ అవుతారు. ఆట మళ్ళీ మొదలు అవుతుంది. మరో విధానంలో పిల్లలందరూ నేలపై గుండ్రంగా కూర్చుంటారు. ఒకరు లేదా నాయకత్వం వహించే వ్యక్తి మధ్యలో ఉంటారు. అందరూ కలిసి లయబద్ధంగా "వీరి వీరి గుమ్మడి పండు.. వీరి పేరేమి?" అంటూ పాడుతారు. మధ్యలో ఉన్న వ్యక్తి ఒకరి పేరు చెబుతాడు. ఆ పేరు ఉన్న వ్యక్తి వెంటనే లేచి అక్కడ నుండి పారిపోవాలి. లేకపోతే మిగతా వారు అతన్ని పట్టుకోవడానికి ప్రయత్నిస్తారు. ఎవరినైనా పట్టుకుంటే, ఆ పిల్లవాడి పేరు చెప్పాలి. పేరు సరిగ్గా చెబితే వారే తదుపరి దొంగ కావచ్చు. తప్పుగా పేరు చెబితే, ఆ పిల్లవాడు మళ్లీ దాక్కోవచ్చు.

**- బలరాం**


చందాదారులుగా చేరండి! చేర్పించండి
హిందూ నగారా సంవత్సర చందా రూ. 100/-
మీతో పాటుగా మరి కొంతమందిని
చందాదారులుగా చేర్పించండి.

UNION BANK OF INDIA
A/C No. 014511100004775
IFSC CODE: UBIN0801453
Governorpet Branch,
VIJAYAWADA

# ఒత్తిడిని తగ్గించే మరీచ్యాసనం



మరీచి అంటే సూర్యుడు, కిరణం అని అర్థం. మరీచ్యాసనం అనేది బ్రహ్మ మానస పుత్రుడైన మరీచి మహర్షి పేరు మీద వెలసిన ఒక యోగాసనం. ఇది నేల మీద కూర్చుని ముందుకు వంగడం, శరీరాన్ని తిప్పడంతో కూడిన భంగిమ. అష్టాంగ యోగాలో దీనికి ప్రత్యేక స్థానం ఉంది.

**చేసే విధానం:** మ్యాట్‌పైన ప్రశాంతంగా కూర్చోండి. ఇప్పుడు రెండు కాళ్లను చాచి దండాసనంలో విశ్రాంతి తీసుకోవాలి. నెమ్మదిగా ఎడమ కాలిని మడిచి, ఎడమ పాదాన్ని ఫొటోలో చూపిన విధంగా తీసుకొచ్చి నేలపై ఆన్చి, మోకాలిని నిలువుగా ఉంచండి. ఇప్పుడు ఎడమ చేత్తో ఎడమ మోకాలిని చుట్టి ఉంచి చేతులు రెండూ వీపు వెనక్కి తీసుకురావాలి. కుడి చేత్తో ఎడమ మణికట్టును పట్టుకుని లాక్ చేయండి. ఇప్పుడు ఊపిరి తీసుకుంటూ ఛాతీని విస్తరించి, నడుమును సాగదీయండి. ఆపై గాలిని వదులుతూ చాచిన కాలి వైపుగా వంగి మీ నుదుటిని మోకాలిపై ఆన్చేందుకు ప్రయత్నించండి. ఇలా 10 నుంచి 15 సెకన్లు ఆసనంలో ఉంటూ సాధారణ శ్వాస తీసుకోవాలి. తర్వాత పైకిలేచి రెండో కాలిని చాచి ప్రశాంతంగా విశ్రాంతి తీసుకోవాలి. ఇప్పుడు మరోవైపు ఆసనాన్ని పునరావృతం చేయాలి.

**ఇవీ ప్రయోజనాలు:** పొట్టలోని అవయవాలను ఉత్తేజపరిచి గ్యాస్, మలబద్ధకం సమస్యలను తగ్గిస్తుంది. జీర్ణక్రియ మెరుగవుతుంది. కండరాలకు మంచి రక్తప్రసరణ జరుగుతుంది. ఉదర భాగ కండరాలు ఉత్తేజితం అవుతాయి. వెన్నుపూసను బలపరుస్తుంది. మెదడును ప్రశాంతపరిచి, ఒత్తిడిని తగ్గించడంలో సహాయపడుతుంది.

**ఎవరు చేయకూడదు:** తీవ్రమైన నడుము నొప్పి, మోకాళ్ల నొప్పులు, హెర్నియా సమస్యలు ఉన్నవారు, వెన్నెముకకు సర్జరీలు అయినవాళ్లు, డిస్క్ సమస్యలు ఉన్నవాళ్లు ఈ ఆసనం చేయకూడదు.

**– చాణక్య**

# అగస్త్యుడికి తలొగ్గిన వింధ్య పర్వతం!



హిందూ పురాణాలలో అత్యంత ప్రసిద్ధులైన సప్తఋషులలో అగస్త్య మహర్షి ఒకరు. గొప్ప తపోధనుడైన ఆయన అద్భుతమైన శక్తులు కలిగిన మహాజ్ఞాని. ఈయనను దక్షిణ భారతదేశంలో 'అగత్తియార్' అని కూడా పిలుస్తారు. పురాణాల ప్రకారం, మిత్రుడు, వరుణుల తేజస్సు నుంచి కుంభంలో (కలశంలో) జన్మించినందున ఈయనను -కుంభసంభవుడు- అని కూడా పిలుస్తారు. ఈయన భార్య పేరు లోపాముద్ర. ఋగ్వేదంలో 1.165 నుంచి 1.191వ శ్లోకం వరకూ ఈ దంపతులు రాసినవేనని పురాణ కథనం. ఎన్నో ఇతిహాసాలు, పురాణాలలో అగస్త్యుడి ప్రస్తావన కనబడుతుంది. ఒకసారి వింధ్య పర్వతం గర్వంతో విపరీతంగా పెరిగి సూర్య సంచారానికి అడ్డుగా నిలిచింది. అప్పుడు అగస్త్య మహర్షి ఆ పర్వతాన్ని అణచి, అది శాశ్వతంగా వంగిపోయేలా చేసి దక్షిణ దేశానికి వెళ్లారు. దేవతల ప్రార్థన మేరకు రాక్షసులు సముద్రంలో దాక్కున్నప్పుడు, అగస్త్యుడు తన అద్భుతమైన శక్తితో సమస్త సముద్ర జలాన్ని ఆచమనం (తాగి) చేసి రాక్షసులను బయటపెట్టాడు. ఇల్వలుడు, వాతాపి అనే ఇద్దరు రాక్షసులు బ్రాహ్మణులను మోసం చేసి చంపుతుండగా, అగస్త్యుడు వాతాపిని తిని జీర్ణించుకుని మునులకు ఆ రాక్షస బాధను విముక్తి చేశాడు. రావణాసురుడితో యుద్ధం చేసే సమయంలో శ్రీరాముడు అలసిపోయినప్పుడు, అగస్త్య మహర్షి రామునికి ఆదిత్య హృదయ స్తోత్రాన్ని ఉపదేశించారు. దీనిని పఠించడం వల్లే రాముడు విజయం సాధించాడు. ఆయుర్వేద వైద్యానికి, సిద్ధ వైద్యానికి, జ్యోతిషానికి, తమిళ సాహిత్యానికి అగస్త్య మహర్షి ఎంతో సేవ చేశారు. అగస్త్య సంహిత ఈయన జ్ఞానానికి నిదర్శనం. పురాతన జపనీస్ గ్రంథం అగస్త్యపర్వ అనేది అగస్త్యుడు రాసినదే. ఈ పుస్తకం 11వ శతాబ్దపు ముద్రణ ఇప్పటికీ లభ్యమవుతోంది. వరాహ పురాణంలోని అగస్త్య గీత, ద్వైద నిర్యాణ తంత్రం, స్కంద పురాణంలోని అగస్త్య సంహితలను ఈయనే రచించాడు. ఆకాశంలో సిరియస్ అనే నక్షత్రం పక్కన ఉండే కనపస్ అనే నక్షత్రాన్ని అగస్త్య తారగా పిలుస్తారు. అత్యంత ప్రకాశవంతమైన నక్షత్రాలలో ఇది రెండోది. ఇరానియన్ భాషలో గస్త్య అంటే పాపం అని అర్థం. అగస్త్య అంటే పాపం చేయనివాడు. ఈయన ఇప్పటికీ చిరంజీవిగా సూక్ష్మ రూపంలో తపస్సులో ఉన్నారని నమ్ముతారు. దక్షిణాసియాలోని దేవాలయాలలో లభించిన పురాతన శిల్పాలలో ఈయన విగ్రహం కూడా ఉంది. అలాగే ఇండోనేషియాలోని జావా దీవిలో ఉన్న శివాలయంలోనూ అగస్త్యుడి విగ్రహం ఉండటం విశేషం.

## స్మిత పూర్వభాషి ఆ దశరథ నందనుడు!

**రా**ముడి గురించి పౌరులు దశరథుడితో చెబుతూ, **స్మిత పూర్వభాషి** అని వర్ణిస్తారు. ఈ విధంగా చిరునవ్వుతో మాట్లాడటం, ముందుగా తానే పలకరించడం అనేవి ప్రతి ఒక్కరూ ప్రయత్నపూర్వకంగా అయినా అలవర్చుకోవాల్సిన మంచి లక్షణాలు. అదేవిధంగా కార్యసాధనకు పనికొచ్చే మరో గుణం.. కార్యనిశ్చయంలో రెండో ఆలోచన లేకపోవడం. తాను చేయదలుచుకున్న పనిని గురించి, దానిలోని సాధక బాధకాలు, సాధ్యాసాధ్యాలు మొదలైనవన్నీ ముందుగానే ఆలోచించి, రాబోయే ఆటంకాలను గురించి కొంత అవగాహనతో ఉండటం, కష్టమైనా ఆ పనిని కడవరకూ కొనసాగించడం ధీరుల లక్షణం.



ఆంజనేయుడు అశోకవనంలో ఉన్న సీతమ్మను చూసినప్పుడు ఆమెకు తాను రామదూతనని నమ్మకం కలిగించడానికి రాముడి గుణాలను వర్ణిస్తాడు. ఆ సందర్భంలో **రక్షితా స్వస్య వృత్తస్య** (తన నడవడికను రక్షించుకొనేవాడు) అంటాడు. ఏ కాలంలో అయినా, ఏ మనిషికైనా ఇది చాలా అవసరమైన గుణం. ఈ సందర్భంలోనే సీతమ్మ ఆంజనేయుడికి రాముడి వనవాసానికి గల కారణం వివరిస్తుంది. జీవితానికి ఆపద కలిగినప్పుడు కూడా రాముడు అప్రియంగా మాట్లాడడు అని చెబుతుంది. సహజంగానే సాత్వికుడైన వ్యక్తి కూడా గొప్ప ఆపద కలిగినప్పుడు అప్రియంగానే మాట్లాడతాడు. అతని దుఃఖ తీవ్రత ఎదుటివారికి మరింత దుఃఖాన్ని కలిగిస్తుందనే విషయాన్ని విస్మరిస్తాడు. అందుకే ధనం, అధికారం లభించినప్పుడు గానీ, గొప్ప కష్టం గానీ ఉన్నతి కలిగినప్పుడు గానీ మనిషి సహజ లక్షణాలు తెలుస్తాయంటారు. జీవితంలో కష్టసుఖాలు, ఉచ్ఛ నీచ స్థితులు కలగడం సహజం. ఎలాంటి పరిస్థితి ఎదురైన అప్రియంగా మాట్లాడకపోవడం కూడా ఒకవిధంగా స్థితప్రజ్ఞతే.


**హిందూనగారా**
**పాఠకులకు విజ్ఞప్తి**

హిందూ నగారాలో ప్రచురించబడుతున్న వార్తలు, వ్యాసాలపై మీ అభిప్రాయాలను ఈ క్రింది ఫోన్ నెంబరుకు వాట్సప్ ద్వారా కానీ, ఫోన్ చేసి కానీ తెలుపవచ్చు. అలాగే మీ మీ ప్రాంతాలలో జరిగే హిందుత్వ ప్రాధాన్యత కలిగిన సంఘటనలను కూడా మాకు తెలియపరచవచ్చు.

మీరు ఫోన్ / వాట్సప్ చెయ్యవలసిన నెంబర్ : 8333812685


## అవసరమైతే రణచండి అవతారమూ ఎత్తాలి!

**రమ్య:** ఏం చదువుతున్నావు వదినా.. వినాయక చవితికి అన్నీ సిద్ధం చేసుకున్నావా?

**ఉజ్వల:** ఆహా... అన్ని పనులు అయ్యాయి వదినా... జిజా మాత, అహిల్యాబాయి హోల్కర్ గురించి చదువుతున్నాను.

**రమ్య:** ఇన్ని పనులు పెట్టుకొని ఇప్పుడు అవి చదవడం ఎందుకు? ఏ దేవీ భగవతమో, ఇంకేదైనా భక్తి పుస్తకాలో చదివితే పుణ్యం, పురుషార్థం కూడా వస్తాయి కదా.

**ఉజ్వల:** గత వారం రోజుల నుంచి వార్తలు గమనిస్తున్నావా. కోనసీమలో సాధిక్ ఖాన్ అనే వ్యక్తి కారణంగా ఒక పూర్తి కుటుంబమే ఆత్మహత్య చేసుకుంది.



**రమ్య:** ఔను.. నేనూ విన్నాను. అలా ఎలా నమ్మింది వాడిని. అదీ వివాహం అయిన మహిళ అలాంటివాడి వలలో ఎలా పడింది?

**ఉజ్వల:** నిజమే.. పరాయి పురుషుడిని పెళ్ళి అయిన స్త్రీ ఎలా నమ్మిందన్న ప్రశ్నే వేస్తున్నారు తప్ప, ఈ మధ్యకాలంలో ఇలాంటి కేసులు బయటపడటానికి కారణం ఏమిటని ఎవరూ ఆలోచించడం లేదు.

**రమ్య:** ఈ మధ్య ఇదో ఫ్యాషన్ అయిపోయింది. సోషల్ మీడియా ప్రభావమో, వెబ్ సిరీస్‌ల కారణంగానో ఈ విధంగా తెలియని వ్యక్తుల ఉచ్చులో పడుతున్నారు.

**ఉజ్వల:** నువ్వూ అలాగే మాట్లాడుతున్నావు ఏంటి? అమ్మాయి నుంచి మహిళగా ఎదిగే క్రమంలో ఎన్ని సమస్యలు, ఉచ్చులను తప్పించుకోవాలో తెలియనిదా? కానీ వాటిని ఎలా ఎదుర్కోవాలనే దానిపై ఇప్పుడు ఎవరు చెబుతున్నారు? అవసరమైతే రణచండి అవతారం ఎత్తగలిగే ధైర్యం, తెగింపు ఉండాలి. చిన్న విషయాలకే లొంగిపోయే సున్నిత మనస్తత్వం నుంచి రాటుతేలాలి అని చెప్పే వ్యక్తుల జీవితం గురించి చెప్పే వ్యవస్థ ఈ రోజు ఎటుపోయింది?

**రమ్య:** ఔను.. అవి అసలు మచ్చుకైనా కనబడటం లేదు. వినబడటం లేదు.

**ఉజ్వల:** జిజా మాత, అహిల్యాబాయి, లక్ష్మీబాయి, రామ్ ప్యారీ.. ఇలాంటి వ్యక్తుల జీవితాలు చదివితే.. ప్రేరణ పొందుతారు. వాళ్ళు ఎదుర్కొన్న సవాళ్ళ ముందు మనకొచ్చిన కష్టం ఏపాటిది అని తెలుస్తుంది.

**రమ్య:** నిజమే! డిగ్రీల కోసం చదివే పుస్తకాలతో పాటు జీవితం సరైన దారిలో వెళ్ళడానికి దారిచూపించే వ్యక్తుల జీవితాలను కూడా చదివాల్సిన అవసరం ఉంది. అప్పుడే సమస్య నుంచి తప్పించుకోవడమే కాదు.. అసలు ఒక సమస్యను ఎలా ఎదుర్కోవాలో తెలుస్తుంది.

**– లింగం ఉజ్వల**

## పదకేళి 23

| | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|
| 1 | | 2 | | ■ | 3 | 4 | |
| | ■ | | ■ | 5 | ■ | | ■ |
| 6 | 7 | ■ | 8 | | 9 | ■ | 10 |
| ■ | 11 | 12 | | ■ | 13 | | |
| 14 | | | ■ | 15 | | ■ | |
| | ■ | ■ | 16 | | ■ | 17 | ■ |
| ■ | ■ | 18 | ■ | 19 | 20 | | 21 |
| 22 | | | | ■ | | ■ | |

### ఆధారాలు

**అడ్డం**

1. చిత్తూరు జిల్లాలో వినాయకుడి ప్రముఖ పుణ్యక్షేత్రం (4)
3. వంద సంవత్సరాలు (3)
6. మాట్లాడేది భాష అయితే రాసేది _ _ (2)
8. గ్రామదేవత పండుగ(3)
11. వివేకానంద తొలిసారి ప్రసంగించిన అమెరికా నగరం (3)
13. కథ కంటె పెద్దది, మహిళ (3)
14. ప్రాణం --- , పోకడ తెలీవట (3)
15. గారము (2)
16. శత్రుత్వం (2)
19. దిండు (4)
22. దేవతల శిల్పి (4)

**నిలువు**

1. కాపలా (3)
2. పాడేది (2)
4. సహించు (2)
5. దుకాణాల వరుస (2)
7. చిన్న పిట్ట (3)
8. మేలుకో (2)
9. నరం మెలిపడింది (3)
10. గణపతి నవరాత్రులు మొదలు పెట్టినవారు (3)
12. దగ్గర, ఆకుకూరలోని తొడిమ (2)
14. దీనితో నూలు వడుకుతారు (2)
15. _ _ _ దీపం కొండంత వెలుగు (3)
17. ఇల్లులుకుతూ పేరు మరిచింది (2)
18. రాకకు ఎదురు (2)
20. సంపదలిచ్చే దేవత (2)
21. టముకు వేసే వాయిద్యం (2)


**నిర్వహణ :**
**ఫణీంద్ర పురాణపండ**

## పదకేళి 22 - జవాబులు

| | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|
| 1 శ్రా | 2 వ | ణ | 3 మా | సం | ■ | 4 రా | ఖీ |
| ■ | ణు | ■ | ట | ■ | 5 బా | ట | ■ |
| 6 ల | కు | 7 మి | ■ | 8 చె | వి | ■ | 9 గం |
| క్ష | ■ | 10 డ | ప్పు | ■ | ■ | 11 గుం | డం |
| ■ | 12 వా | త | ■ | 13 అ | దు | పు | ■ |
| 14 వే | ణి | ■ | 15 వె | ల | ■ | ■ | 16 జ |
| గం | ■ | 17 క్రో | ■ | ■ | 18 ఈ | గ | ల |
| ■ | 19 తు | ల | సీ | దా | సు | ■ | జ |

## స్వాతంత్ర్యోద్యమంలో ఆంధ్ర వీరులు
## భయంకర వెంకటాచారి

**అ**ది 1933వ సంవత్సరం. ఏప్రిల్ 15వ తేదీ. కాకినాడ రేవులో పడవల చాటుగా ఒక ఎర్రని కాగితంలో చుట్టిన ఒక బంతి పదార్థం కనిపించింది. అదేమిటో తెలుసుకోవాలన్న ఆసక్తితో అక్కడి మత్స్యకారులు దాన్ని తీసుకొని పరీక్షిస్తుండగా అది పెద్ద శబ్దంతో పేలిపోయింది. అక్కడ ఉన్న వారిలో కొందరికి తీవ్రమైన, మరికొందరికి స్వల్పంగా గాయాలయ్యాయి. ఈ ఘటన పెను సంచలనం కలిగించింది. ఈ ఘటనకు బాధ్యుడు ప్రతివాది భయంకర వెంకటాచార్యులనే అకళంక దేశభక్తుడు. టెర్రరిస్టు ఉద్యమంలో చేరాక ఆయన తన పేరును భయంకరాచారిగా మార్చుకున్నారు. ఆయన మిత్రుల కార్యకలాపాలను అంతకుముందు నుంచే కనిపెడుతున్న పోలీసులు ఆ బాంబు పేలుడు ఘటనకు వారే బాధ్యులని గుర్తించి అరెస్టు చేశారు. ఈ కేసులో ప్రధాన ముద్దాయి భయంకరాచారితో పాటు మరో ఐదుగురిని నిందితులుగా చేర్చారు. మద్రాస్ హైకోర్టులో న్యాయమూర్తులు జస్టిస్ మాధవన్ నాయర్, జస్టిస్ ఓర్నేలుతో కూడిన ధర్మాసనం ఎదుట కేసు విచారణకు వచ్చింది. నిందితుల తరఫున ఆనాటి ప్రసిద్ధ న్యాయవాది బస్సు జగన్నాథరావు వాదించారు. ఆయుధాలు తయారు చేయడం, మారణాయుధాలు కలిగి ఉండటం తీవ్రమైన నేరాలుగా పరిగణించిన న్యాయమూర్తులు భయంకరాచారికి ద్వీపాంతరవాస శిక్ష విధించారు. మిగిలినవారిని విడిచిపెట్టారు. ఆయన అండమాన్ దీవులలో సుదీర్ఘకాలం ప్రవాస జైలుశిక్ష అనుభవించారు. తోటి ఖైదీలలో స్వాతంత్ర్య స్ఫూర్తిని నింపడానికి అహర్నిశలు శ్రమించారు. భరతమాత దాస్య శృంఖలాల ఛేదనే లక్ష్యంగా శ్రమించిన దేశభక్తుడు భయంకరాచారి తన జైలు జీవితంపై ఒక పుస్తకం రాశారు. అండమాన్‌లోని సెల్యులర్ జైలు శిక్షను అనుభవించిన ఏకైక తెలుగువాడు.



### ఈ నెల శ్లోకము



**అగ్నిహోత్రం గృహం క్షేత్రం గర్భిణీవృద్ధబాలకాన్ ।**
**రిక్తహస్తేన నోపేయాత్ రాజానం దైవతం గురుమ్ ॥**

**భావము:** యజ్ఞ యాగాదులు జరిగే స్థలాలకు వెళ్లినప్పుడు, పర్యటన ముగించుకొని తన ఇంటికి వెళ్లినప్పుడు, మరొకరి ఇంటికి వెళ్లినప్పుడు, యాత్రా స్థలాలైన క్షేత్రాలకు వెళ్లిన సమయంలోనూ, గర్భిణులను, వృద్ధులను, పిల్లలను చూడటానికి వెళ్లేటప్పుడు, అదేవిధంగా రాజ దర్శనం, దైవ దర్శనం, గురుదేవుల వద్దకు వెళ్లేటప్పుడు ఉత్త చేతులతో వెళ్లకూడదు.

‘వందేమాతరం’ గీతంలోని సాహిత్యం హిందూ దేవతలైన దుర్గ, లక్ష్మి వంటి వారిని పూజించడం గురించి కాదని, కేవలం ‘భారతమాత’కు చేసే ఆరాధన అని యోగా గురు బాబా రాందేవ్ స్పష్టం చేశారు. ఉత్తరాఖండ్‌లోని హరిద్వార్‌లో జరిగిన ఓ కార్యక్రమంలో రాందేవ్ మాట్లాడుతూ.. “మేము భారతమాతనే దుర్గగా, లక్ష్మిగా భావిస్తాం. ఆమే మా విశ్వాసం, మా జ్ఞానం, మా ఆలయం. వందేమాతరంలో దేవతలను, ఆలయాలను చూసేవారు మన సంస్కృతికి దూరమైన వారు. భారతమాత ఆరాధనను దేవతలతో ముడిపెట్టి ఒక మతానికి వ్యతిరేకమని చెప్పడం మేధో దివాళాకోరుతనం” అని రాందేవ్ అన్నారు.

## వందేమాతరం అంటే హిందూ దేవతల పూజ కాదు: బాబా రాందేవ్





## థేమ్స్ నది తీరంలో గంగా హారతి

‘గంగా హారతి’ అనగానే కాశీ, హరిద్వార్, రిషికేశ్ ఘాట్లు గుర్తుకొస్తాయి. శతాబ్దాలుగా కొనసాగుతున్న ఈ ఆధ్యాత్మిక సంప్రదాయం ఇప్పుడు తొలిసారిగా లండన్‌లోని థేమ్స్ నది తీరానికి చేరనుంది. లండన్‌లో సెప్టెంబరు 13న థేమ్స్ నదీ తీరంలో చిన్మయ మిషన్ యూకే, టోటల్లీ థేమ్స్ సంస్థల ఆధ్వర్యంలో ప్రత్యేకంగా గంగా హారతిని నిర్వహించనున్నారు. లండన్‌లోని రాయల్ స్టెప్స్ సమీపంలో సాయంత్రం 7.15 గంటలకు హారతి ప్రారంభం కానుంది. ఈ సందర్భంగా పూలు, విగ్రహాలు లేదా ఇతర పూజా సామగ్రిని నదిలో వేయడానికి అనుమతి లేదని నిర్వాహకులు స్పష్టం చేశారు. నదిని పరిశుభ్రంగా, పర్యావరణహితంగా ఉంచుతూ బాధ్యతాయుతంగా వేడుకలో పాల్గొనాలని సందర్శకులకు సూచించారు.





## త్వరలో గగన్‌యాన్ ప్రయోగం

గగన్‌యాన్ మిషన్‌కు సంబంధించి ఇస్రో ఛైర్మన్ డాక్టర్ వి.నారాయణన్ కీలక ప్రకటన చేశారు. గుజరాత్ లోని అహ్మదాబాద్ లో జరిగిన మూడో నేషనల్ స్పేస్ డే వేడుకల్లో ఆయన మాట్లాడుతూ.. రానున్న నాలుగు నెలల్లో గగన్ యాన్ మిషన్లో భాగంగా మొదటి మానవ రహిత (అన్-క్రూడ్) ప్రయోగాన్ని నిర్వహించే అవకాశం ఉందని వెల్లడించారు. అంతరిక్ష రంగంలో భారత్ వేగంగా అభివృద్ధి చెందుతూ వస్తోందని నారాయణన్ పేర్కొన్నారు. గగన్ యాన్ మిషన్‌కు సంబంధించి ఇప్పటి వరకు దాదాపు 8వేల టెస్టులు పూర్తయ్యాయని తెలిపారు. మూడు మానవ రహిత ప్రయోగాల తర్వాత మానవ సహిత మిషన్ చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. ఈ ఆర్థిక ఏడాదిలో 12 ఉపగ్రహాలను సిద్ధం చేయాలని, అలాగే ఎని మిది లాంచ్ వెహికల్ మిషన్లను చేపట్టాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు.

## అయోధ్యలో అరుదైన సంప్రదాయం.. రాష్ట్రపతి, ప్రధానికి శాంతా దేవి రాఖీలు

రక్షాబంధన్ పర్వదినాన్ని పురస్కరించుకుని మర్యాదా పురుషోత్తముడు శ్రీరాముని సోదరి శాంతా దేవి తరఫున దేశ ప్రముఖులకు రాఖీలు పంపారు. శృంగి రిషి సేవా సంస్థాన్ అధ్యక్షుడు సుభాష్ సింగ్ ఆధ్వర్యంలో ఈ సంప్రదాయం కొన్నేళ్లుగా కొనసాగుతోంది. సాకేత్ భవన్ మహంత్ సీతారాం దాస్ మహారాజ్ ఆధ్వర్యంలో వేద మంత్రోచ్చారణలు, శాస్త్రోక్త విధివిధానాలతో ఈ రాఖీలన్నింటికీ ప్రత్యేక పూజలు నిర్వహించారు. శాంతా దేవి తరఫున పంపిన ఈ రాఖీలను రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర హోం మంత్రి అమిత్ షా, రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, ఉత్తరప్రదేశ్ గవర్నర్ ఆనందీబెన్ పటేల్, ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ తదితరులకు పంపినట్లు నిర్వాహకులు తెలిపారు. సహజసిద్ధమైన అరటి నారను తీసుకుని, చేతితో వీటిని ప్రత్యేకంగా రూపొందించారు.



**HINDU NAGARA**

Telugu Monthly, Volume : 34,Issue :09

Postal Registration No : VJ/152/2023-25, RIN No. 52882/93

Date of Publishing : 28-08-2026, Date of Posting : 06-09-2026, Pages : 16

## యూట్యూబ్ లో 'ప్రకృతి పాఠాలు'

కోటేశ్వరరెడ్డి కూడా ఉద్యోగాన్ని వదిలి వ్యవసాయం వైపు అడుగులు వేసిన యువ రైతు. ఎమ్మెస్సీ పూర్తి చేసిన అనంతరం ఓ కంపెనీలో బీమా ఏజెంట్‌గా పనిచేశారు. అయితే ఉరుకుల పరుగుల ఉద్యోగ జీవితం నచ్చక.. వ్యవసాయంపై ఉన్న ఆసక్తితో సాగు రంగంలోకి వచ్చారు. తనకున్న ఐదు ఎకరాల పొలంలో వేరుసెనగ, బుడ్డసెనగ, పత్తి, బత్తాయి పంటలను సాగు చేస్తున్నారు. సామాజిక మాధ్యమాలతో పాటు జీరో బడ్జెట్ న్యాచురల్ ఫార్మింగ్ శాఖ, 'సేవ్' సంస్థ వ్యవస్థాపకుడు విజయరామ్ నిర్వహించిన అవగాహన సదస్సులకు హాజరై ప్రకృతి వ్యవసాయంపై అనేక విషయాలను నేర్చుకున్నారు. సాగు పద్ధతులు, అనుభవాలను తన యూట్యూబ్ ఛానల్ ద్వారా ఇతర రైతులతో పంచుకుంటున్నారు. ప్రకృతి వ్యవసాయంపై మరింత మందికి అవగాహన కల్పించడమే తన లక్ష్యమని కోటేశ్వరరెడ్డి చెబుతున్నారు. ఉద్యోగమే జీవితానికి భరోసా అనే ఆలోచనకు భిన్నంగా.. వ్యవసాయంలో తమ భవిష్యత్తును వెతుక్కుంటున్న ఈ యువ రైతులు, పట్టుదలతో సాగు చేస్తే వ్యవసాయం కూడా మంచి ఉపాధి మార్గంగా మారుతుందని నిరూపిస్తున్నారు.

# ఉద్యోగాలు వదిలి.. ప్రకృతి వ్యవసాయం బాట

నేటి యువతలో చాలామంది మంచి ఉద్యోగం, ఆకర్షణీయమైన జీతం, స్థిరమైన కెరీర్ కోసం పరుగులు తీస్తుంటారు. అయితే పులివెందులకు చెందిన కొందరు యువకులు మాత్రం అందుకు భిన్నమైన మార్గాన్ని ఎంచుకున్నారు. ఉద్యోగాలను వదిలి వ్యవసాయం వైపు అడుగులు వేసి.. ప్రకృతి సాగుతో సంతృప్తితో పాటు మంచి ఆదాయాన్ని పొందుతున్నారు. ఆరోగ్యకరమైన పంటలను పండిస్తూ.. తోటి రైతులకు, యువతకు ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు.



వైయస్సార్ కడప జిల్లా పులివెందుల మండలం ఉల్లిమెల్ల గ్రామానికి చెందిన సుదర్శన్‌రెడ్డి 2011లో బీటెక్ పూర్తి చేసిన అనంతరం బెంగళూరులో ఉద్యోగంలో చేరారు. మంచి జీతం వచ్చినప్పటికీ వ్యవసాయంపై ఉన్న మక్కువతో కరోనా సమయంలో స్వగ్రామానికి తిరిగి వచ్చి సాగు రంగంలోకి అడుగుపెట్టారు. తనకున్న 10 ఎకరాల పొలంలో సేంద్రియ విధానంలో బత్తాయి, పామాయిల్ (ఆయిల్‌ఫామ్), శ్రీగంధం, మల్లెపూలతో పాటు శనగ, వేరుసెనగ, పత్తి వంటి పంటలను అంతర పంటలుగా సాగు చేస్తున్నారు. పెట్టుబడులు పోగా మంచి లాభాలు వస్తున్నాయని ఆయన తెలిపారు. తాను అనుసరిస్తున్న ప్రకృతి వ్యవసాయ విధానంపై ఇతర రైతులకు కూడా అవగాహన కల్పిస్తున్నానని, దీంతో తాను చేస్తున్న పని మనసుకు ఎంతో సంతృప్తినిస్తోందని సుదర్శన్‌రెడ్డి చెబుతున్నారు.



విజయవాడ అయోధ్య నగర్‌లోని హైందవిలో ఆగస్టు 28న సేవాహి పరమో ధర్మః - సేవయే పరమ ధర్మం పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ప్రాంత ప్రచారక్ శ్రీ విజయాదిత్య, ముఖ్య అతిథి శ్రీ విజయ సారథి, శ్రీ కావూరి ఓంకార నరసింహం




విజయవాడ కెబిఎన్ కళాశాల ప్రాంగణంలో ఆగస్టు 23న నిర్వహించిన శతగానలహరి కార్యక్రమంలో దేశభక్తి గీతాలు పాడుతున్న స్వయం సేవకులు

Published by : Tulasi Surya Prakash on behalf of Sahiti Sudha Foundation from Madhavasadan, Kaleswara Rao Road, Governorpet, Vijayawada - 520002 and Printer Chiruvolu Vasu Deva Rao and Printed at : B.S.R. Enterprises, D.No: 32-26-110/6, Narra Gopala Krishnaiah Street, Maruthi Nagar, VIJAYAWADA - 520004, Editor : Chiruvolu Vasu Deva Rao, Cell : 9490923439